క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దేముల్: తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తామని సీఈఓ రాజమౌళి అదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు రోజుల క్రితం జరగవలసిన సమావేశానికి సంఘం సభ్యుల ఫోరం లేక వాయిదా వేయడం వలన నేడు జరగనుందని ప్రకటించారు. అందుకు సంఘం సభ్యులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రూ.1.32 కోట్లతో రోడ్డు పునర్నిర్మాణం



బీటీరోడ్డును తవ్వుతున్న జేసీబీ

ధారూరు: ధారూరు-కుక్కింద దారిలో రూ. 1.32 కోట్లతో బీటీరోడ్డు పునర్నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 4 కిలో మీటర్ల పొడవున ఎక్కడెక్కడ గుంతలు, మెట్టలు ఉన్నాయో అక్కడ జేసీబీ సహాయంతో రోడ్డును తవ్వేసి కొత్తగా వేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బరమ్స్‌ను బాగుచేయిస్తున్నారు. మెయింటనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్డు కింద ఈ నిధులు మంజూరు అయినట్లు ఆదివారం మండల పంచాయతీరాజ్ ఏఈ ప్రణీత్ తెలిపారు.

వీధి నాటకాలను ప్రోత్సహించాలి

దోమ: గుండాలలో మూడు రోజులుగా ప్రదర్శిస్తున్న వీధి నాటకాన్ని శనివారం రాత్రి బీఆర్ఎస్ మండల సీనియర్ నేతలు రాఘవేందర్ రెడ్డి, బంగ్ల యాదయ్యగౌడ్ వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీధి నాటకాలు గ్రామీణ ప్రాంత ప్రజలను ఎంతగానో ఉత్తేజపరుస్తాయని తెలిపారు. ప్రాచీన కాలం నాటి నుంచి వేస్తున్న వీధి నాటకాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు నాటక ప్రదర్శన కళాకారులకు రూ.11 వేలు విరాళం అందజేస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



విద్యార్థుల నృత్య ప్రదర్శన

బంట్వారం: కోట్‌పల్లి మండలం బార్వాద్ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధారూరు సీఐ అప్పయ్య ముఖ్య అతిథిగా పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరత్నం, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచ్ వెంకటేశం, కోట్‌పల్లి ఎస్ఐ సత్యానారాయణరాజు, ఎస్‌వీఆర్ ట్రస్ట్ ఫౌండర్ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'సమ్మేళనంలో అవమానించారు..'

యాలాల: పార్టీ కోసం కష్టపడుతున్న తనను ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా అవమానించారని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఆత్మీయతతో పాటు పల్లెపల్లెకు పైలెట్ కార్యక్రమంలో గ్రామాల్లో పర్యటిస్తున్నానని, యువతను ఏకతాటిపైకి తెస్తూ.. పార్టీ పటిష్టతకు పాటుపడుతున్న తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నెల 6న యువత ఆధ్వర్యంలో తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ప్రవీణ్ పేర్కొన్నారు.

'అంజిలమ్మ కుటుంబాన్ని ఆదుకుంటాం'

దోమ: అనారోగ్యంతో మృతి చెందిన వీఓఏ అంజిలమ్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి చెప్పారు. ఆదివారం మల్లేపల్లి గ్రామంలో ఆమె అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొని, అంజిలమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, సర్పంచ్ అంజిలయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, స్థానిక నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మర్పల్లి: మండల పరిధిలోని కోట్‌మర్పల్లిలో ఆదివారం చైతన్య యువజన సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బేగరి అంజయ్య, ఉపాధ్యక్షులుగా నగేశ్, మొగులయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు, సహాయ కార్యదర్శిగా రవి, కోశాధికారిగా రవీందర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా రాములు, కార్యవర్గ సభ్యులుగా రాహుల్ తదితరులు ఉన్నారు.

ఆదరణ కరువై.. బతుకు భారమై

మట్టి పాత్రల్లో చేసే వంటకాల రుచే వేరని, వాటిలో నీరు నిల్వ ఉంచి తాగితే రోగాలు మాయం అవుతాయన్నది ఎంత వాస్తవమో కానీ.. పూర్వికుల నుంచి రెండు తరాల ముందు వరకు ఇంటింటా మట్టి పాత్రలదే అధిక పాత్ర. కాలక్రమేణా వాటి ఉనికితో పాటు.. తయారు చేసే కుమ్మరుల వృత్తి ప్రశార్థకంగా మారింది.

- కునారిల్లుతున్న కుమ్మరి వృత్తి
- కష్టంగా మారిన జీవనోపాధి
- పేదోడి ఫ్రిజ్‌కు తగ్గిన మక్కువ
- చేయూతనందించాలంటున్న కుమ్మర్లు



కోట్‌పల్లిలో మట్టి దీపాలు తయారు చేస్తున్న కుమ్మరి



మట్టి కుండల పనిలో నిమగ్నమై..

బంట్వారం: వేసవి అనగానే టక్కున గుర్తుకు వచ్చేది చల్లని నీరు. అవీ మట్టికుండలోనివైతే మరీ మంచివిగా భావించే వారు. కానీ.. మారుతున్న కాలంతో పాటు అలవాట్లు మారడం సహజం. అందులో భాగంగానే పేదోడి ఫ్రిజ్‌గా పిలవబడే మట్టి కుండలకు రానురాను ఆదరణ తరిగి.. రీఫ్రిజ్‌రేటర్లపై మక్కువ ఎక్కువయింది. అల్యూమినియం, స్టీల్, ప్లాస్టిక్ వినియోగం పెరిగింది. ఫలితంగా కుండల తయారీ తగ్గింది. దీంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదరణ లేక.. బతుకు భారంగా మారిందని కుమ్మర్లు ఆందోళన చెందుతున్నారు.

మట్టి కొనుగోలుకు ఇబ్బందే..

తాతల కాలం నుంచి కుల వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న తమకు ప్రభుత్వ ఆదరణ కరువైందని, అయినప్పటికీ బతుకు బండిని లాగిస్తున్నామని పలువురు కుమ్మర్లు వాపోతున్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో 30 కుమ్మరి కుటుంబాలు నాటి నుంచి వృత్తిని కొనసాగిస్తున్నామని చెప్పారు. 'కుండల తయారీకి మట్టి తేవాలంటే నానా తంటాలు పడుతున్నాము. దూరభారం పెరిగి.. రవాణ చార్జీలు అధికమయ్యాయి. కానీ.. కుండల ధర పెంచితే కొనేవారు ముందుకు రావడంలేదు. అలా అని వృత్తిని మానుకుంటే బతికేదెట్లా' అని కుమ్మర్లు ఆందోళనకు గురవుతున్నారు.

గ్రామాల్లో విక్రయం

40 సంవత్సరాల క్రితమే కోట్‌పల్లి కుండలకు పెట్టింది పేరని, అప్పట్లో వివిధ రకాల మట్టి కుండలతో పాటు, పొయ్యిలు, వంట పాత్రలను తయారు చేసేవారమని కుమ్మర్లు తెలిపారు. అలా చేసిన కుండలను గాడిదలపై వేసుకొని చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయిస్తామని, నేటికీ అదే పని చేస్తూ.. జీవనం కొనసాగిస్తున్నామని, ఆటోల్లో తీసుకెళ్లి సంతలో విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతే కాంకుడా అవసరాన్ని బట్టి కొందరు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కుండలు తీసుకెళ్తుంటారని చెప్పారు.

ఆదరణ లేక

పేదోడి ఫ్రిజ్‌గా పిలువబడే మట్టి కుండలకు ఇంతకు ముందు బలే గిరాకీ ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. చల్లటి నీరు అనగానే ఫ్రిజ్‌లు గుర్తుకు వస్తున్నాయి. మట్టి కుండలను ఇప్పటికీ అక్కడక్కడా వాడుతున్నప్పటికీ.. నాటి వైభవం రావడం కష్టమేమనని కుమ్మరులు వాపోతున్నారు. ఉగాది పర్వదినాన చేసే పచ్చడికి మాత్రం తప్పని సరిగా కొంటున్నారని, కుండల సైజును బట్టి ధర నిర్ణయిస్తామని, వచ్చిన ఆదాయంతోనే సరిపెట్టుకుంటున్నామని కుమ్మరులు చెబుతున్నారు. ఏడాది మొత్తంగా నాలుగైదు నెలలు మాత్రమే పని ఉంటుందని, మిగతా సమయాల్లో ఇతర పనులు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రజక, క్షౌర తదితర వృత్తులకు చేయూతనందిస్తున్నట్లుగానే.. కుమ్మరి వృత్తి దారులను ఆదరించాలని కోరుతున్నారు.

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి



కుల వృత్తినే నమ్ముకున్నాం. ఇప్పటికీ అదే పనిని కొనసాగిస్తున్నాం. పదేళ్లుగా కుటుంబీకులకు కుండల తయారీ పనిలో సహాయపడుతున్న. కుండలకు గిరాకీ తగ్గింది. వేసవిలో కాస్త కొంటారు. పండుగలకు బాగానే అమ్ముతాం. పెద్దగా లాభాలు లేకపోయినా.. వృత్తిని వీడడం లేదు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థిక సహాయం లేదు. ఇప్పటికైనా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి.

– మల్లేశం, కోట్‌పల్లి

తట్టెపల్లి రోడ్డును పూర్తి చేయండి

- దుమ్ముధూళితో ప్రయాణం కష్టంగా ఉంది
- వాహనదారుల విజ్ఞప్తి

పెద్దేముల్: మధ్యలో ఆగిపోయిన రోడ్డు పనులు పూర్తి చేసి, దుమ్ముధూళి, ప్రమాదాల భారిన పడకుండా రక్షించాలని వాహనదారులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు రవాణ సౌకర్యం మెరుగు పరచాలనే లక్ష్యంతో రహదారుల విస్తరణ, మరమ్మతు, కొత్తగా నిర్మాణానికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తోంది. అయినప్పటికీ నిర్మాణ దారుల అలసత్వమో.., అటవీ శాఖ అనుమతి లేకనో కానీ.. రహదారుల నిర్మాణ పనులు మధ్యలో నిలచిపోతున్నాయని పరిసరప్రాంత ప్రజలు చెబుతున్నారు.

అడ్కిచెర్ల నుంచి తట్టెపల్లి వరకు..

తాండూరు మండలం జినగుర్తి నుంచి పెద్దేముల్ మండల తట్టెపల్లి వరకు ప్రభుత్వం సుమారు రూ.25కోట్లు మంజూరు చేసినట్లు సమాచారం. జినగుర్తి నుంచి సుమారు ఏడు కిలో మీటర్ల రోడ్డు పనులు పూర్తి గాక అడ్కిచెర్ల సమీపంలో అటవీ ప్రాంతం అనుమతులు లేక పనులు నిలచిపోయాయి. అడ్కిచెర్ల నుంచి తట్టెపల్లి వరకు కంకర వేసిన రోడ్డుతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు త్వరగా స్పందించి పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని అడ్కిచెర్ల, పాషాపూర్, తట్టెపల్లి, జైరాంతండా, ఓంలానాయక్ తండాతో పాటు పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు జనార్ధన్‌రెడ్డి, గెమ్యా, శంకర్, జైరాం, భరత్‌కుమార్, గోపాల్, అంజప్ప తదితరులు కోరుతున్నారు.



తట్టెపల్లి వద్ద వాహనం వెళ్లడంతో ఎగిసి పడుతున్న దుమ్ము

హైమాస్టు లైట్ల ఏర్పాటు

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో హైమాస్టు బల్బులు ఆదివారం స్తంభాలకు బిగించారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సహకారంతో కౌన్సిలర్ మధుయాదవ్ పట్టణంలోని బ్రాహ్మణవాడ, సంతబజార్ సమీపంలో లైట్లను క్రేన్ సాయంతో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ తన వార్డులో నాలుగు బల్బులు, ఆలయం వద్ద ఒక బల్బు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. తెలుగుగేరి, బ్రాహ్మణవాడలో మురుగు కాల్వలు నిర్మించి, సీసీరోడ్లు వేస్తున్నట్లు చెప్పారు.

దాహార్తిని తీర్చడానికే చలివేంద్రాలు



వికారాబాద్ అర్బన్: చలివేంద్రం ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

వికారాబాద్ అర్బన్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శ్రీ రామ సేవాసమితీ, కృష్ణ పంతులు ఆధ్వర్యంలో శ్రీ రామ మందిరం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రోజు అనేక మంది రకరకాల పనుల నిమిత్తం వచ్చిపోతుంటారని, అలాంటి వారి దాహం తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం మంచి ఆలోచనన్నారు. మరిన్ని సంఘాలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, నాయకులు మోముల రాజ్ కుమార్, మాధవ రెడ్డి, కేపి రాజు, సత్యనారాయణ గౌడ్, రామ్ నివాస్ రాఠి తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం: సర్పంచ్

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని మందిపల్ సర్పంచ్ మఠం ప్రమీల అన్నారు. చౌడాపూర్ మండలం మందిపల్‌లో శ్రీ ఓంకారేశ్వర ఆలయం, సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. వేసవికాలంలో బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ చలివేంద్రంలో అంబలి, మజ్జిగ, తాగునీటిని అందుబాటులో ఉంచుతామని తెలిపారు. శివశంకర్, శివకుమార్, కేశవులు, రాజశేఖర్, బాలరాజ్, సాయిముదిరాజ్, నర్సింహులు, సాయిలు, చెన్నయ్య, కృష్ణయ్య, గంగయ్య, సుధీర్, శ్రీశైలం, నానోజీ పాల్గొన్నారు.

తెలంగాణ వీరత్వానికి ప్రతీక సర్దార్

- యువత పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి
- పాపన్న గౌడ్ వర్ధంతిలో వక్తలు



కుల్కచర్ల: స్వామి వివేకానంద విగ్రహం వద్ద పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కుల్కచర్ల: తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీకని, అన్ని వర్గాలను కలుపుకొని నాటి నియంతృత్వ, నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా పాపన్న పోరాటం చేశారని, పాపన్న జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313 వర్ధంతి సందర్భంగా ఆదివారం కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద గౌడసంఘం ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, మహేశ్వరం రాములు మాట్లాడారు. సర్వాయి పాపన్న రాష్ట్రానికే గర్వకారణమని, యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధనకు గౌడ కులస్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. వెంకటయ్య గౌడ్, వెంకటయ్య గౌడ్, రాఘవేందర్ గౌడ్, శివకుమార్ గౌడ్, ఆంజనేయులు, బాలు, సర్పంచ్ సామ్యారెడ్డి, ఎంపీటీసీ ఆనందం పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

మర్పల్లి: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్ అన్నారు. పాపన్న వర్ధంతి సందర్భంగా ఆ సంఘం నేతలు పోరాట యోధుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. మర్పల్లి ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్, తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుల్జారామ్‌గౌడ్, సంఘం నాయకులు బలరాంగౌడ్, వీరేశం గౌడ్, ప్రశాంత్‌గౌడ్, అంబయ్యగౌడ్, నర్సింహులుగౌడ్, హన్మంత్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు..

తాండూరు రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో కరన్‌కోట్ గ్రామంలో ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ.. జమీందార్లు, జాగీర్దార్ల పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ.. బహుజనుల కోసం పోరాటం చేసిన యోధుడు సర్దార్ అని కొనియాడారు.

నేటి నుంచి పది పరీక్షలు

- 30 నిమిషాల ముందే ఎగ్జామ్ సెంటర్‌కు రావాలి: ఎంఈఓలు

ధారూరు: పది పరీక్షలు నేటి నుంచి జరగనున్నాయని, అందుకు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత, కేరెళ్లి ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ బాబుసింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధారూరులో 180 మంది, కేరెళ్లిలో 170 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆయన ప్రకటించారు. మండలంలోని నాగసమందర్, కుక్కింద, మోమిన్‌కలాన్, నాగారం, కేరెళ్లి, ధారూరు బాలబాలికల ఉన్నత పాఠశాలలు, ధారూరు కేజీబీవీ, తరిగోపులతో కలిపి మొత్తం 350 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

202 మంది విద్యార్థులు..

బంట్వారం: మండలంలో మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 202 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. అదే విధంగా కోట్‌పల్లి జెడ్పీ పాఠశాల కేంద్రంలో 153 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

మండలంలో 405 మంది..

మర్పల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, ఎస్టీ ఆశ్రమ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు 405 మంది పరీక్ష రాయనున్నారని మండల విద్యాధికారి విద్యాసాగర్ తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే ఎగ్జామ్ సెంటర్‌కు రావాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు.

631 మంది..

పూడూరు: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి హరిశ్చందర్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. మండల పరిధిలోని 12 ప్రభుత్వ, 2 ప్రైవేటు పాఠశాల విద్యార్థులు 631 మంది పరీక్ష రాయనున్నారని, మన్నెగుడ, పూడూరు, చన్గోముల్ గ్రామాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ఇంటింటికీ కాంగ్రెస్



ప్రచారం చేస్తున్న నాయకులు

కొడంగల్: మండల పరిధిలోని చిన్న నందిగామలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో పర్యటించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ ఆదేశాల మేరకు ఇంటింటి ప్రచారం చేస్తున్నట్లు పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ నాయక్, ఆసిఫ్‌ఖాన్, సోమశేఖర్, నయీమ్, దాము పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల పల్లకీ సేవ

బొంరాస్‌పేట: నాగిరెడ్డిపల్లి గ్రామ శివారు గుట్టపై కొలువుదీరిన పార్వతీ పరమేశ్వరుల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతం, అభిషేకం, అంకురార్పణ కార్యక్రమాలు జరిపారు. సాయంత్రం గ్రామం నుంచి గుట్టపైకి పార్వతీ పరమేశ్వరుల పల్లకీ సేవ చేశారు. భాజాభజంత్రీలు, భక్తుల భజనల నడుమ స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం సుప్రభాతం, అభిషేకం, హోమాలు నిర్వహించి పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం జరపనున్నారు. సాయంత్రం పల్లకీసేవ, పెరుగు బసంతం కార్యక్రమాలు, మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం వీడ్కోలు సభ ఉంటుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.



పూజలందుకుంటున్న స్వామివారు

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

పూడూరు: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కంకల్ గ్రామంలో మల్లన్నస్వామి ఆలయ వార్షికోత్సవ ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకున్నప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు వీరన్న, రవీందర్, ప్రభాకర్‌రెడ్డి, అశోక్, శ్రీశైలం, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ నిర్మాణాన్ని అడ్డుకోండి



ఎస్ఐ రవిగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కొడంగల్ రూరల్: రైతువేదికకు అడ్డుగా నిర్మిస్తున్న కట్టడాన్ని నిలిపివేయించాలని ఆదివారం పర్సాపూర్ సర్పంచ్ సయ్యద్ అంజద్, ఎంపీటీసీ గొల్ల గోవిందమ్మ, ఉప సర్పంచ్ మొగులయ్య, పలువురు గ్రామ పెద్దలు ఎస్ఐ రవిగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. పర్సాపూర్‌లోని రైతువేదికకు అడ్డుగా కట్టడం నిర్మిస్తే.. ఆ వేదిక క్లస్టర్ పరిధిలోని ఏడు గ్రామాలకు చెందిన రైతులు ధాన్యం తీసుకొచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వెంటనే ఆ నిర్మాణాన్ని అడ్డుకొని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామకృష్ణయ్య, బసప్ప, హన్మంత్, వార్డు సభ్యులు, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

5నుంచి కాళికాదేవి బ్రహ్మోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విశ్వకర్మ, గౌడ సంఘం నేతలు

కుల్కచర్ల: ఈ నెల 5వ తేది నుంచి జరిగే శ్రీ కాళికాదేవి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని విశ్వకర్మ సంఘం నాయకులు, ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మయ్యచార్యులు, రమేశ్‌చార్యులు కోరారు. ఆదివారం విశ్వకర్మ, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 5నుంచి 7 వరకు ఆలయ ఉత్సవాలు ఉంటాయని చెప్పారు. 5న ఉత్సవమూర్తిని కుల్కచర్ల నుంచి కాళికాదేవి ఆలయం వరకు పల్లకీసేవలో ఊరేగింపుగా తీసుకవెళ్లడం, ప్రత్యేకపూజలు ఉంటాయన్నారు. 6న ప్రత్యేకపూజలు, శకటోత్సవం, 7న తెల్లవారు జామున రథోత్సవం, సాయంత్రం అమ్మవారిని కుల్కచర్లకు తీసుకెళ్లడంతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆపద్బాంధవుడిలా..



తల్లికి శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది

- 108లో సుఖప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం

కుల్కచర్ల: సామాన్య ప్రజలకు అత్యవసర సేవలు అందిస్తూ.. అందరి మన్ననలు పొందుతోంది 108 వాహనం. ఆదివారం కుల్కచర్లలో 108 ఆపద్బాంధవుడి పాత్రను పోషించింది. ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన లక్ష్మీ అనే నిండు గర్భిణి ఆదివారం తెల్లవారు జామున సూమారు 1గంట ప్రాంతంలో పురిటినొప్పులతో బాధపడుతోంది. అర్ధరాత్రి కావడంతో వేరే వాహనదారులు ఎవరూ స్పందించలేదు. దీంతో 108వాహనానికి ఫోన్ చేయగా.. స్పందించిన సిబ్బంది నవీన్, నారాయణ వెంటనే లక్ష్మీ ఇంటికి చేరుకున్నారు. నిండు చూలాలిని 108లో కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ నరేష్ ఆమెకు సుఖప్రసవం చేయగా.. ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు.